సాక్షి
జగిత్యాల

శుక్రవారం ǀ 11 ǀ ఆగస్టు ǀ 2023



వీధివ్యాపారులకు అండగా..

కరోనా కాలంలో చిరువ్యాపారులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆత్మనిర్భర్ నిధి అభియాన్ అండగా నిలుస్తోంది.

8లో▸



ఏర్పాట్లు పరిశీలన

కోరుట్ల: పట్టణంలో ఈ నెల 13న జరిగే పద్మశాలీ ఆత్మగౌరవ సభ ఏర్పాట్లను ఎమ్మెల్సీ రమణ గురువారం పరిశీలించారు. పలు సూచనలు చేశారు.

గరిష్టం/కనిష్టం
33.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కలెక్టర్‌కు జాతీయజెండా అందజేత



కలెక్టర్‌కు జాతీయ జెండా అందజేస్తున్న హెడ్ పోస్ట్‌మాస్టర్ రవీందర్

జగిత్యాల: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా 76వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ ఆదేశాల మేరకు హర్‌ఘర్ తిరంగా 2.0 కార్యక్రమం చేపట్టినట్లు జగిత్యాల హెడ్ పోస్ట్‌మాస్టర్ రవీందర్ తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం కలెక్టర్ యాస్మిన్ బాషాకు జాతీయ జెండా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలన్న నినాదంతో తపాలా శాఖ ఆధ్వర్యంలో జెండాలు విక్రయిస్తున్నామని, ఈక్రమంలో పోస్టాఫీసులో జాతీయ జెండా ఉత్సవాలు నిర్వహిస్తున్నామని వివరించారు.

మద్యం దుకాణాలకు 56 దరఖాస్తులు

జగిత్యాలక్రైం: జగిత్యాల, ధర్మపురి, మెట్‌పల్లి పరిధిలో గురువారం సాయంత్రం వరకు 56 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీధర్ తెలిపారు. దరఖాస్తుదారులు మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్, పాన్‌కార్డు, సామాజిక వర్గానికి కేటాయించిన షాపులకు వారి కుల ధ్రువీకరణ పత్రం, దరఖాస్తు రుసుము రూ.2 లక్షల డీడీతో జగిత్యాల ధరూర్ క్యాంప్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్లలో సమర్పించాలన్నారు. ఈనెల 18 వరకు దరఖాస్తులు స్వీకరించబడుతాయని పేర్కొన్నారు. ఈనెల 21న జగిత్యాలలోని వీరూపాక్షి గార్డెన్స్‌లో ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో డ్రా పద్ధతిలో మద్యం దుకాణాల కేటాయింపు ఉంటుందని తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా స్వాతంత్య్ర దినోత్సవం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

జగిత్యాల: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ప్రణాళికబద్ధంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 15న స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, స్థానిక ఖిలా ఆవరణలో జరుగనున్న వేడుకలకు సంబంధించి పరేడ్, బందోబస్తు, బారికేడ్, గౌరవ వందనం తదితర ఏర్పాట్లను పోలీసు శాఖ పర్యవేక్షించాలని సూచించారు. గ్రౌండ్ క్లీనింగ్, వేదిక అలంకరణ, తాగునీటి సౌకర్యం, పారిశుధ్య పనులపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ఇన్విటేషన్ కార్డ్స్, అవార్డు సంబంధిత శాఖల వారీగా ఒక్కో శాఖ ఒక్కో ఉద్యోగికి మాత్రమే ఉత్తమ సేవల అవార్డుల జాబితా తయారు చేసి అందించాలన్నారు. ప్రొటోకాల్, ఇన్విటేషన్ కార్డులు అందరికీ అందేలా చూడాలన్నారు. వేదికపై సిట్టింగ్‌కు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. దేశభక్తి గీతాల మీదుగా సాంస్కృతిక ప్రదర్శనలు, విద్యాశాఖ అధికారి ద్వారా నిర్వహించాలని ఆదేశించారు. వీవీఐపీలు, వీఐపీ, పాత్రికేయులకు అసౌకర్యం లేకుండా చూసుకోవాలన్నారు. 108, 102, అంబులెన్స్, ఫస్ట్‌ఎయిడ్ కిట్ అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జగిత్యాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్య, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ మూడు దశల ఆందోళనలకు పిలుపునివ్వడం జరిగిందని ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి నాయకులు తెలిపారు. గురువారం ఓల్డ్ హైస్కూల్‌లో సంబంధిత పోస్టర్ ఆవిష్కరించారు. రెండో దశ ఆందోళనలో భాగంగా ఈనెల 12 నుంచి అన్ని జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నాలు చేపడుతామని పేర్కొన్నారు. 2023 జూన్ 30తో మొదటి పీఆర్సీ గడువు ముగిసినందున వెంటనే కమిటీ నియమించాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని, 30 డిమాండ్లతో కూడిన సమస్యల పరిష్కారం కోసం దశల వారీ కార్యక్రమాలు చేపడుతామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్యామ్‌సుందర్, బోగ రమేశ్, రాంరెడ్డి, శంకర్‌బాబు, రాంచంద్రం, నరేందర్, రఘుపతియాదవ్ పాల్గొన్నారు.

ఉపాధి చూపించలే

మెట్‌పల్లి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని శంకర్(పేరు మార్చాం) గుడుంబా తయారు చేసి విక్రయించేవాడు. వచ్చే డబ్బుతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. అయితే, గుడుంబా తయారీ, విక్రయాలు మానేస్తే ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తుందని ఎక్సైజ్ అధికారులు భరోసా ఇచ్చారు. ఇందుకోసం ఆర్థిక సాయం అందిస్తుందని చెప్పారు. దీంతో శంకర్ ఆ వ్యాపకం ఆపేశాడు. సుమారు ఆరేళ్లు గడిచింది. అధికారులు ఇచ్చిన హామీ ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. మరోవ్యాపారం చేయడానికి అవసరమైన సొమ్ము లేక, కుటుంబ పోషణ భారమై మళ్లీ గుడుంబా దందాలోకి దిగాడు.



కలికోట తండాలో బెల్లంపానకం పారబోస్తున్న ఎక్సైజ్ సిబ్బంది (ఫైల్)

కఠినంగా వ్యవహరిస్తున్నాం



గుడుంబా నియంత్రణ విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నాం. ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ బృందాలతో జిల్లావ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాం. తద్వారా గతేడాదికన్నా ఈసారి కేసుల సంఖ్య తగ్గింది. ఈ సంవత్సరంలో ఇప్పటివరకు 208 మందిని బైండోవర్ చేశాం. పునరావాస పథకం కింద ఐదేళ్ల క్రితం కొందరికి ఉపాధి కల్పించాం. ఆ తర్వాత ప్రభుత్వం నుంచి నిధులు రాలేదు.

– శ్రీధర్, సూపరింటెండెంట్, జిల్లా ఎక్సైజ్ శాఖ

- వెయ్యి మందికిపైగా దరఖాస్తుదారులు
- 159 మందికే 'ప్రత్యామ్నాయ ఉపాధి'
- అభాసుపాలైన 'గుడుంబా తయారీదారుల పునరావాసం'
- నిధుల మంజూరులో ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం
- మళ్లీ తయారీ, విక్రయాల వైపు దరఖాస్తుదారులు

ఈ ఏడాది ఇప్పటివరకు నమోదైన కేసుల వివరాలు



మెట్‌పల్లి(కోరుట్ల): 'జిల్లాలో గుడుంబా తయారీ నిర్మూలించాం.. విక్రయాలు కట్టడి చేశాం.. నాటుసారా వాసనే రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నాం.. అందుకే గుడుంబా రహిత జిల్లాగా ప్రకటించాం.. తయారీ, విక్రయదారులకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపించడంతోనే ఇది సాధ్యమైంది..' అని ప్రకటించుకున్న జిల్లా ఎక్సైజ్ అధికారుల తీరు అభాసుపాలైంది.. కొంతకాలంగా నమోదవుతున్న కేసులే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

2017లో పునరావాస పథకానికి శ్రీకారం..

- గుడుంబాతో పేద కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతున్నాయని గుర్తించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. తయారీ, విక్రయాలను పూర్తిగా అరికట్టాలని నిర్ణయించింది.
- ముఖ్యంగా తయారీ, విక్రయదారులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తేనే ఇది సాధ్యమని భావించింది.
- ఇందుకోసం ప్రత్యేకంగా 2017 సంవత్సరంలో 'గుడుంబా తయారీదారుల పునరావాస పథకం' ప్రారంభించింది.
- దీనికింద రూ.2లక్షల వరకు ఆర్థిక సాయం అందజేసి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టింది.

జిల్లాలో 159 మందికి ఉపాధి..

గుడుంబా తయారీదారుల పునరావాస పథకం కింద ఉపాధి కోసం జిల్లాలో వెయ్యి మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. తొలివిడతలో ఇందులోంచి 159మందిని ఎంపిక చేసి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించారు. మిగతా దరఖాస్తుదారులందరికీ దశల వారీగా ఆర్థికసాయం అందజేస్తామని భరోసా ఇచ్చారు. తద్వారా గుడుంబా దందాకు వారంతా దూరంగా ఉండిపోయారు. దీంతో క్రయవిక్రయాలు పూర్తిగా అదుపులోకి వచ్చాయి. ఫలితంగా 2017లో జగిత్యాలను గుడుంబా రహిత జిల్లాగా అధికారులు ప్రకటించారు.

పెరుగుతున్న కేసులతో ఆందోళన

- ప్రభుత్వ ఆదేశాలతో ఎంతోశ్రమించి గుడుంబాను ఎక్సైజ్ అధికారులు పూర్తిగా నిర్మూలించారు. అయితే, ప్రస్తుతం కేసుల సంఖ్య పెరుగుతుండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- తొలివిడతలో కొందరికి ఉపాధి కల్పించిన ప్రభుత్వం.. ఆ తర్వాత మిగతా వారిపై నిర్లక్ష్యం ప్రదర్శించింది.
- ఫలితంగా ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తడంతో దందా మానేసిన వారంతా గత్యంతరం లేక మళ్లీ గుడుంబా వ్యాపారం వైపు అడుగులు వేస్తున్నారు.
- ఇప్పటికే చాలామంది గుట్టుగా దందా సాగిస్తున్నారు.
- రంగంలోకి దిగిన ఎక్సైజ్ అధికారులు.. జిల్లావ్యాప్తంగా తనిఖీలు విస్తృతం చేస్తున్నారు.
- ఈ సంవత్సరంలో ఇప్పటివరకు 114 కేసులు నమోదు చేశారు. 118మందిని అరెస్టు చేశారు.
- 208మంది గుడుంబా తయారీ, విక్రయదారులను గుర్తించి తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశారు.

ఎంపీడీవో ఆఫీస్ తరలింపునకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

జగిత్యాల: బీర్‌పూర్ మండల పరిషత్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. అందులో పనిచేస్తున్న సిబ్బంది భయంతో హెల్మెట్లు ధరించి విధులు నిర్వహిస్తుండగా ఇటీవల 'సాక్షి'లో 'హెల్మెట్లు ధరించి విధులు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో ఉన్నతాధికారులు స్పందించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జెడ్పీ సీఈవో రామానుజం, బీర్‌పూర్ ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్‌తో కలిసి బీర్‌పూర్‌లోని కొన్ని భవనాలను పరిశీలించారు. మోతీనగర్‌కాలనీలో గతంలో పాఠశాలగా కొనసాగిన భవనాన్ని పరిశీలించారు. దానికి ప్రస్తుతం కొన్ని మరమ్మతులు చేయడంతో పాటు పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేయాల్సి ఉంది. ఆ భవనంలో మరమ్మతులు చేసేందుకు కొన్ని రోజులు పట్టే అవకాశం ఉన్నందున తాత్కాలికంగా రైతు వేదిక భవనంలో ఎంపీడీవో కార్యాలయ ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. కాగా 2016లో బీర్‌పూర్ మండలంగా ఏర్పడిన తర్వాత అద్దె భవనంలో కార్యాలయం ఏర్పాటు చేశారు. అది పురాతన భవనం కావడంతో సిబ్బందికి ఇబ్బందిగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు భవనం పైకప్పు పెచ్చులు ఊడిపడటంతో అధికారులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు.



ఎంపీడీవో ఆఫీసను తాత్కాలికంగా ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించిన మోతీనగర్‌లోని పాఠశాల

తలనొప్పిగా మారిన హెల్మెట్ విధుల వ్యవహారం

హెల్మెట్ ధరించి ఉద్యోగులు విధులకు హాజరు కావడం సోషల్ మీడియాతో పాటు 'సాక్షి'లో కథనం రావడం అందులో పనిచేస్తున్న ఉద్యోగులకు తలనొప్పిగా మారింది. దీనిపై ఉన్నతాధికారులు మందలించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. సోషల్ మీడియాలో 'ఉన్నతాధికారులకు కార్పొరేట్ భవనాలు.. కింది స్థాయి ఉద్యోగులకు ఇలాంటి భవనాల' అంటూ వైరల్‌గా మారింది. సమస్య ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలి కాని మీడియాలో వచ్చేలా చూడొద్దని మందలించినట్లు తెలిసింది.

ఉపాధ్యాయులకు అండగా ప్రభుత్వం



ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలటౌన్: ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. గురువారం కలెక్టరేట్ ఎదుట తపస్ (తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం) చేపట్టిన జిల్లా స్థాయి ధర్నాకు ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తప్పకుండా ఉపాధ్యాయుల డిమాండ్లు నెరవేర్చుతుందని పేర్కొన్నారు.

న్యాయం చేయాలి

తపస్ ధర్నాలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు, బదిలీలు వెంటనే చేపట్టాలని, జీవో 317 పునఃపరిశీలించి స్థానికత ఆధారంగా బాధితులకు న్యాయం చేయాలని కోరారు. అలాగే బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి తపస్ ధర్నాకు మద్దతు తెలిపి మాట్లాడారు. జీవో 317వల్ల స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు పంపించాలని, పాత పెన్షన్ పునరుద్ధరించాలని కోరారు. ధర్నాలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోనగిరి దేవయ్య, ప్రసాదరావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అయిల్నేని నరేందర్‌రావు, రాష్ట్ర బాధ్యులు ఎలిగేటి రాజేంద్రప్రసాద్, జిల్లా సభ్యులు కందుకూరి నాగరాజు, మండల బాధ్యులు కూర్మాచలం రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

నమ్మించి.. నకిలీ వీసాలు ఇచ్చి..



కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

- గల్ఫ్ ఏజెంట్ పరార్
- నిరుద్యోగుల నుంచి రూ.5 కోట్ల వరకు వసూలు
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

జగిత్యాలక్రైం: విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తామంటూ ఓ ఏజెంట్ జిల్లా కేంద్రంలో గల్ఫ్ ట్రావెల్స్ ఏర్పాటు చేసి నిరుద్యోగుల నుంచి అందినకాడికి దండుకున్నాడు. ఎవరినీ విదేశాలకు పంపించకపోవడంతో పాటు ఐదు రోజులుగా పరారీలో ఉండటంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. నిందితుడు పథకం ప్రకారమే ఏడాది కాలంగా నిరుద్యోగుల నుంచి డబ్బు వసూలు చేసి పరారైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

వివరాలు సేకరిస్తున్న పోలీసులు

నిందితుడు పెట్టిన ట్రావెల్స్ మూసేయడంతో బాధితులంతా బయటకు వస్తున్నారు. బాధితుల్లో ఎక్కువ మంది ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి ప్రాంతాలకు చెందిన వారు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. డబ్బు చెల్లించి విదేశాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలంటూ చాలా మందిని ఏడాది కాలం నుంచి నమ్మిస్తూ వారి నుంచి అందినకాడికి దోచుకొని పరారయ్యాడు.

పెగడపల్లి మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన రాచకొండ మహేశ్ జిల్లా కేంద్రంలోని ధర్మపురి రోడ్‌లో కొద్దికాలంగా శ్రీవిఘ్నేశ్వర కమ్యూనికేషన్ మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీ ట్రావెల్స్ ఏర్పాటు చేశాడు. నిరుద్యోగులను దుబాయ్, కువైట్, యూరప్, థాయిలాండ్, సైప్రాస్, న్యూజిల్యాండ్ తదితర దేశాలకు పంపించేందుకు సుమారు 72 మంది వద్ద రూ.4 లక్షల చొప్పున, 150 మంది వద్ద రూ.లక్షకు పైగా దాదాపు

రూ.5 కోట్లకు టోకరా..

రూ.5 కోట్లు వసూలు చేశాడు. వారందరికీ నకిలీ వీసాలు ఇచ్చి త్వరలో విదేశాలకు పంపిస్తామంటూ కాలం వెళ్లదీస్తూ వచ్చాడు. ఐదు రోజులుగా ఏజెంట్ కార్యాలయాన్ని మూసివేసి పరారీలో ఉండటంతో బాధితులంతా గురువారం కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం ఎస్పీ కార్యాలయానికి వెళ్లి తమ బాధను వెలిబుచ్చారు. దీంతో బాధితులందరినీ జగిత్యాల డీఎస్పీ కార్యాలయానికి పిలిపించి వారి వివరాలు, నిందితుడు వారికి ఇచ్చిన వీసా కాపీలు సేకరించారు.

సైప్రాస్ వెళ్లేందుకు డబ్బు చెల్లించా



ఆరునెలల క్రితం ఉపాధి కోసం సైప్రాస్ వెళ్లేందుకు జిల్లా కేంద్రంలోని విఘ్నేశ్వర కమ్యూనికేషన్ మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీని సంప్రదించా. ఏజెంట్ చెప్పినట్లు రూ.3.50 లక్షలు చెల్లించా. వీసా కూడా ఇచ్చారు. కానీ దేశం పంపేందుకు వాయిదాలు వేస్తూ పరారయ్యాడు. – ఆకుల తిరుపతి, పెగడపల్లి

ఆరునెలల క్రితం డబ్బులు ఇచ్చిన



ఉన్న ఊరులో ఉపాధి లేదని గల్ఫ్ దేశం వెళ్లేందుకు రాచకొండ మహేశ్‌ను సంప్రదించా. సైప్రాస్ పంపించేందుకు ఆరునెలల క్రితం రూ.3.50 లక్షలు తీసుకున్నాడు. కొద్దికాలంగా ఐదు రోజులు, 10 రోజులు అంటూ ట్రావెల్స్ మూసేసి పరారయ్యాడు.

– రాజ్‌కుమార్, పూడూరు, కొడిమ్యాల

నమ్మించి మోసం చేశాడు



న్యూజిలాండ్ వెళ్లేందుకు రూ.2.60 లక్షలు మూడు నెలల క్రితం చెల్లించా. వీసా వచ్చిందని నమ్మించి మోసం చేసి పారిపోయాడు. దీంతో పోలీసులను సంప్రదించా. మాకు న్యాయం చేయాలి – మేరుగు జలేంధర్, వెదిర, రామడుగు

ఊరువాడని నమ్మిన



గల్ఫ్ ఏజెంట్ మా గ్రామస్తుడేనని నమ్మి సైప్రాస్ వెళ్లేందుకు ఆరునెలల క్రితం రూ.3.50 లక్షలు చెల్లించా. వారం రోజుల్లో దేశం పంపిస్తానంటూ నమ్మిస్తూ చివరికి మోసం చేసి పరారయ్యాడు. నిందితుడిని పట్టుకుని మాకు న్యాయం జరిగేలా చూడాలి.

– దన్నవేని రాజయ్య, సుద్దపల్లి, పెగడపల్లి

గృహ'లక్ష' దరఖాస్తులు

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 99,696
- అర్జీదారులతో కిక్కిరిసిన కార్యాలయాలు
- అత్యధికంగా పెద్దపల్లిలో 14,753
- ఈనెల 20లోగా పరిశీలన పూర్తి

సాక్షి, పెద్దపల్లి: రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన గృహలక్ష్మి పథకానికి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 99,696 దరఖాస్తులు వచ్చాయి. నియోజకవర్గానికి మూడువేల మందిని మొదటి విడతలో ఎంపిక చేయనుండడం.. గురువారం చివరిరోజు కావడంతో దరఖాస్తుదారులు పోటెత్తారు. దీంతో ప్రభుత్వ కార్యాలయాలు కిక్కిరిశాయి. గృహలక్ష్మి నిరంతర ప్రక్రియ అని, నిర్ణీత గడువులేదని మంత్రులు ప్రకటిస్తున్నా.. మొదటి విడతలోనే సహాయం పొందాలని భావిస్తున్న వివిధ వర్గాల ప్రజలు అర్జీలు పెట్టుకునేందుకు తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల వద్ద బారులు తీరారు. కావాల్సిన సర్టిఫికెట్లు, దరఖాస్తుల కోసం అర్జీలు పెట్టుకునే వారితో మీసేవా కేంద్రాల్లో రద్దీ నెలకొంది.

అత్యధికంగా పెద్దపల్లి నియోజకవర్గంలో..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 12 నియోజకవర్గాల పరిధిలో 99,696 దరఖాస్తులు వచ్చాయి. అందులో అత్యధికంగా పెద్దపల్లి నియోజకవర్గంలో14,753 దరఖాస్తులు వచ్చాయి. అత్యల్పంగా చొప్పదండి నియోజకవర్గంలో చొప్పదండి 3,176 దరఖాస్తులు వచ్చాయి. గురువారం వరకు వచ్చిన దరఖాస్తుదారులను గుర్తించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, అర్హులైన వారి జాబితాను ఈనెల 20లోగా ప్రకటించాలని నిర్ణయించారు. గడువు (ఈనెల10) తరువాత వచ్చిన దరఖాస్తులను రెండోవిడుతలో పరిశీలించాలని నిర్ణయించారు. కలెక్టర్ల ఆధ్వర్యంలో దరఖాస్తులను పరిశీలించి, ప్రతి నియోజకవర్గంలో ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 10శాతం, బీసీ, మైనార్టీలకు 50 శాతానికి తగ్గకుండా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు.



ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

అసౌకర్యాలతో ఇబ్బందులు పడిన మహిళలు

గృహలక్ష్మికి మహిళల పేరు మీద దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం నిబంధన పెట్టింది. దీంతో దరఖాస్తు చేసుకోవడానికి మహిళలు, వారి భర్తలు, పిల్లలతో ఆయా కేంద్రాల వద్ద పడిగాపులు కాశారు. అక్కడ పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గృహలక్ష్మి దరఖాస్తులు

కరీంనగర్	3,429
కోరుట్ల	6,730
మానకొండూరు	4,499
వేములవాడ	12,913
సిరిసిల్ల	9,979
చొప్పదండి	3,176
హుజూరాబాద్	13,437
పెద్దపల్లి	14,753
రామగుండం	7,402
మంథని	7,950
జగిత్యాల	8,120
ధర్మపురి	7,308
మొత్తం	99,696

క్లుప్తంగా

కళలపై ఆసక్తి ఉండాలి



విద్యార్థులతో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, నరేందర్‌రెడ్డి

జగిత్యాల: విద్యార్థులకు కళలపై ఆసక్తి ఉండాలని, చదువుతో పాటు అన్ని రంగాల్లో ఉంటేనే భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం అల్ఫోర్స్ కళాశాలలో నిర్వహించిన ఫ్యాషన్‌షో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ, అల్ఫోర్స్ విద్యాసంస్థల్లోని విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించడం జరుగుతుందని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చుతూ ఉత్తమంగా తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

అర్హుల జాబితా విడుదల

జగిత్యాల: జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న మహిళ అధ్యాపక పోస్టులు భర్తీకి గతనెలలో నిర్వహించిన అర్హత పరీక్షలో ఎంపికైన అభ్యర్థుల మెరిట్ జాబితాను డీఈవో జగన్మోహన్‌రెడ్డి గురువారం విడుదల చేశారు. jagtialdeo.download/ index.php వెబ్‌సైట్‌లో జాబితా అందుబాటులో ఉందని, 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఈనెల 11న టీచర్స్ భవన్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని, ఉదయం 9.30 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని డీఈవో కోరారు.

ప్రైవేట్ స్కూల్ బస్సులో మంటలు

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణ శివారులోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సులో గురువారం సాయంత్రం మంటలు చెలరేగాయి. వివరాలు.. సాయంత్రం బస్సులో విద్యార్థులను తరలిస్తుండగా మార్గమధ్యలో వట్టివాగు వద్ద ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ వెంటనే బస్సును పక్కకు నిలిపి విద్యార్థులను బయటకు దించాడు. అనంతరం స్థానికుల సాయంతో మంటలను ఆర్పివేశాడు. డ్రైవర్ అప్రమత్తతతో విద్యార్థులకు ఎలాంటి హాని జరగలేదు.

సిలిండర్ పేలి సామగ్రి దగ్ధం



దగ్ధమైన సామగ్రి

కోరుట్ల రూరల్: మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన చెట్‌పెల్లి వెంకటేశ్ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలింది. వెంకటేశ్ భార్య రాజమణి గురువారం ఉదయం వంట చేస్తున్న సమయంలో సిలిండర్ లీకయి మంటలు చెలరేగాయి. వెంటనే అతడు అప్రమత్తమై ఇంటి తలుపులు తెరిచి నీళ్లు పోయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ఇల్లు స్లాబు స్వల్పంగా దెబ్బతినటంతో పాటు వంట సామగ్రి దగ్ధమైంది. ఘటనా స్థలాన్ని రెవెన్యూ అధికారులు, పోలీసులు పరిశీలించారు.

వీధివ్యాపారులకు అండగా ‘ఆత్మ నిర్భర్’

- స్వల్పకాలిక రుణాలతో ఉపాధి
- మూడో విడత పంపిణీకి సిద్ధం



‘ఈ ఫొటోలోని వ్యక్తి జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్‌కు చెందిన పెండ్యాల నరేశ్. చిన్న చిన్న బోళ్లు అమ్ముకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కరోనా సమయంలో అనేక ఇబ్బందులకు గురికాగా, కేంద్రం ప్రవేశపెట్టిన ఆత్మ నిర్భర్ పథకం ద్వారా మొదటి విడతలో రూ.10 వేల రుణం తీసుకున్నాడు. సకాలంలో కిస్తీలు కట్టి రెండో విడతలో రూ.20 వేలు, అందులో సైతం కిస్తీలు కట్టుకుని రూ.50 వేల రుణం పొందాడు. ఈపథకం బాగుందని హర్షం వ్యక్తం చేశాడు.’



‘ఈమె ధర్మపురికి చెందిన సంపంగి మల్లవ్వ. కూరగాయల వ్యాపారం చేసుకుంటూ జీవిస్తోంది. కరోనా సమయంలో మల్లవ్వ ఇబ్బందులు పడగా, ఆత్మ నిర్భర్ పథకం ద్వారా లోన్ తీసుకుంది. రెండు విడతలు సక్రమంగా చెల్లించగా, మళ్లీ రూ.50 వేల రుణం మంజూరైంది. వడ్డీ బెడద తప్పిందని ఆనందం వ్యక్తం చేసింది’.



‘ఈ చిత్రంలోని వ్యక్తి జగిత్యాలకు చెందిన ఆది నారాయణ. ఇతను చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. రెండు విడతల్లో రుణం పొంది సకాలంలో కిస్తీలు చెల్లించాడు. ఈ పథకం ఇలాగే కొనసాగాలని, మాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉందని సంతోషం వ్యక్తం చేస్తున్నాడు’.

మూడో విడతలో అర్హులైన వీధి వ్యాపారులు..

మున్సిపాలిటీ	వీధివ్యాపారులు	లక్ష్యం	దరఖాస్తులు	రుణం మంజూరు	ఇచ్చిన రుణాలు
జగిత్యాల	6,005	629	162	146	136
కోరుట్ల	4,081	411	57	49	46
మెట్‌పల్లి	3,548	361	85	74	71
రాయికల్	815	88	71	69	69
ధర్మపురి	858	94	42	39	39
మొత్తం	15,307	1,583	417	377	361

జగిత్యాల: కరోనా కాలంలో చిరువ్యాపారులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఈనేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆత్మనిర్భర్ నిధి అభియాన్ అండగా నిలుస్తోంది. చిరువ్యాపారులను వడ్డీ వ్యాపారుల నుంచి రక్షిస్తుంది. మెప్మా ఆధ్వర్యంలో వారికి రుణాలు అందజేస్తున్నారు. ఒక్కో వ్యాపారికి రూ.10 వేల చొప్పున మొదటి విడత అందజేయగా ప్రస్తుతం సకాలంలో డబ్బు కట్టిన చిరువ్యాపారులకు మళ్లీ రెండో విడతలో రూ.20 వేల రుణాలు అందించడంతో ఊరటనిచ్చింది. ఇటీవల మూడో విడతకు అధికారులు ప్రణాళికలు రూపొందించి అందించారు. ఈ పథకం కింద ఒక్కో వ్యాపారికి ఏడాదికి రూ.10 వేలు అందజేస్తారు. రుణం పొందిన వ్యాపారి సకాలంలో చెల్లిస్తే తీసుకున్న రుణానికి 7 శాతంతో తిరిగి వారి ఖాతాల్లో జమచేస్తారు. 7 శాతం వడ్డీ కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లించిన చిరువ్యాపారులకు మరింత రుణాలు అందజేయనున్నారు. ఇలా ఏటా సకాలంలో చెల్లించిన వారికి రుణ పరిమితి పెంచుతూ వెళ్తారు. వడ్డీ రాయితీ సైతం వారి ఖాతాల్లోకి వెళ్తుంది.

మూడో విడత పంపిణీకి చర్యలు

గతంలో చిరువ్యాపారులను ఆదుకునేందుకు రుణం అందించగా సకాలంలో చెల్లించిన వారికి మూడో విడతలో రూ.50 వేలు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఏ బ్యాంక్ ద్వారా మున్సిపాలిటీలో ఎందరికి మూడో విడత రుణం అందించాలో అధికారులు సిద్ధం చేశారు.

వివరాలు సేకరిస్తున్నాం

వీధివ్యాపారులకు మరోసారి రుణాలు అందించేందుకు ప్రణాళిక రూపొందించాం. మొదటి, రెండోసారి రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన వారికి రూ.50 వేలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే మహిళా సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి సర్వే చేయిస్తున్నాం. ఏమైనా సమస్యలుంటే వీధివ్యాపారులు మా దృష్టికి తీసుకురావచ్చు.

– సునీత, మెప్మా డీఎంసీ

కౌన్సిలర్ కుటుంబానికి అండగా ఉంటాం



కౌన్సిలర్ ఉమారాణిని ఓదార్చుతున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

కోరుట్ల: పట్టణానికి చెందిన మున్సిపల్ కౌన్సిలర్ పోగుల ఉమారాణి కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. కౌన్సిలర్ భర్త పోగుల లక్ష్మీరాజం 3 రోజుల క్రితం హత్యకు గురికాగా వారి కుటుంబాన్ని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే గురువారం పరామర్శించి సానుభూతి తెలిపారు. వారి పిల్లలను ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని తామంతా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్–2 పరీక్షలు వాయిదా వేయాలి

మెట్‌పల్లి(కోరుట్ల): ప్రభుత్వం గ్రూప్–2 పరీక్షలను వాయిదా వేయాలని కాంగ్రెస్ నాయకుడు ఖుత్బుద్దీన్ గురువారం డిమాండ్ చేశారు. ఈ పరీక్షలకు ఆరు రోజుల ముందు గురుకుల పరీక్షలు, మూడు రోజుల తర్వాత జూనియర్ లెక్చరర్స్ పరీక్షలు ఉన్నాయన్నారు. పరీక్షల మధ్య తక్కువ సమయం ఉండడం వల్ల అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని వాయిదా వేయాలని కోరారు.



ఘనంగా తీజ్ ఉత్సవాలు

కథలాపూర్(వేములవాడ): మండలంలోని పోతారం గ్రామశివారు లొంక రామేశ్వర తండాలో గురువారం సాయంత్రం గిరిజనులు తీజ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. తమ సంప్రదాయ పద్ధతుల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆడుతూ పాడుతూ ఆనందంగా గడిపారు. ఉత్సవాల్లో కాంగ్రెస్ సీనియర్ నేత ఆది శ్రీనివాస్, ఎంపీటీసీ పులి శిరీషా, నాయకులు కాయితి నాగరాజు, తొట్ల అంజయ్య, నర్సయ్య, రాములు, ధరావత్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు



మాట్లాడుతున్న సీఐ రఫీక్‌ఖాన్

జగిత్యాలక్రైం: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని సీఐ రఫీక్‌ఖాన్ అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ట్రాఫిక్ నియమాలు పాటించని 45 మందికి గురువారం జగిత్యాల ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. జిల్లాలో అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో రోజూ డ్రంకెన్‌డ్రైవ్, ట్రాఫిక్ నియమాలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టడం జరుగుతుందన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై పకడ్బందీ చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం తాగి మొదటిసారి, రెండోసారి పట్టుబడిన వారికి మద్యం మోతాదు బట్టి శిక్షలు విధించడం జరుగుతుందన్నారు. ఓవర్ స్పీడ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం తాగి వాహనాలు నడిపితే జరిగిన ప్రమాదాలపై ఆడియో, వీడియో ద్వారా అవగాహన కల్పించారు.

ప్రజారోగ్యం కోసమే ఉచిత వైద్య శిబిరాలు



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహారావు

కథలాపూర్(వేములవాడ): ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చల్మెడ ఆనందరావు వైద్య విజ్ఞాన సంస్థ చైర్మన్ చల్మెడ లక్ష్మీనరసింహారావు పేర్కొన్నారు. గురువారం మేడిపెల్లి మండలం కొండాపూర్‌లో సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 360 మందికి వైద్య చికిత్సలు అందించారు. ఇందులో 65 మందికి మెరుగైన వైద్యం అవసరమని గుర్తించామని, వీరిని కరీంనగర్‌లోని ఆసుపత్రికి తీసుకెళ్లి ఉచితంగా చికిత్స అందిస్తామన్నారు. గ్రామాల్లో ఉచితంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తే ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ అభిలాశ్, సింగిల్ విండో చైర్మన్ రవీందర్‌రావు, నాయకులు అంకం సాగర్, అంగడి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నిరంజన్‌రెడ్డి

మల్యాల(చొప్పదండి): మల్యాల మండల ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడిగా కొనసాగుతున్న ముత్యంపేటకు చెందిన సంత నిరంజన్‌రెడ్డి ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈమేరకు ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి కృషి చేసిన చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యంకు నిరంజన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఆత్మ గౌరవ సభ ఏర్పాట్లు పరిశీలన



మాట్లాడుతున్న నాయకులు

కోరుట్ల: కోరుట్లలో ఈ నెల 13న జరిగే పద్మశాలీ ఆత్మ గౌరవ సభకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి లక్ష మంది హాజరవుతారని పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు బోగ వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణ శివారులోని పద్మశాలీ ఆత్మ గౌరవ సభా ప్రాంగణంలో గురువారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సభ కోసం జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. జనాన్ని తరలించేందుకు సరైన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు కటుకం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చెట్‌పల్లి సుధాకర్, వీరబత్తిని శ్రీనివాస్, శంకరయ్య, రాజేశం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డం మధు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రైతులపై ప్రభుత్వం వివక్ష

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్(జగిత్యాల): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పరిహారం ఏ మేరకు అందిందన్న విషయంపై ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకోవాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హితవు పలికారు. గురువారం సారంగాపూర్ మండల కేంద్రంలో మాట్లాడారు. జిల్లాలో గడిచిన రబీతో కలిపి వరుసగా మూడు పంటలు ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయారని, ఇందులో పండ్ల తోటలు, ఇతర పంటలకు సంబంధించిన రైతులు ఉన్నారని పేర్కొన్నారు. సీఎం ప్రకటించిన ఎకరాకు రూ.10 వేల పరిహారం జిల్లాలో ఇప్పటికీ ఒక్క రైతుకు అందలేదని జిల్లా రైతులపై ప్రభుత్వం వివక్ష చూపుతుందన్నారు. ప్రస్తుతం వానాకాలం పంట సగం ముగిసినా ఆరెకరాలు దాటిన రైతులకు రైతుబంధు అందలేదన్నారు. రోళ్లవాగు ప్రాజెక్టు తూములకు గేట్లు బిగించాలని, వర్షాలకు చాలా రోడ్లు దెబ్బతిన్నాయని, వీటన్నింటిపై ఇటీవల శాసనమండలి సమావేశంలో ప్రస్తావించగా, ప్రభుత్వం నుంచి వచ్చే సమాధానం పరిశీలిస్తామని చెప్పడంతో సరిపోయిందని తెలిపారు. ప్రభుత్వం రైతుల పక్షపాతి అని చెప్పుకుంటూనే మిల్లర్ల కొమ్ముకాస్తుందని ఆరోపించారు. కొనుగోలు చేసిన ధాన్యం వేలం వేయాలని ప్రభుత్వం ఇటీవల నిర్ణయించినట్లు వార్తలు వస్తున్నాయని, వేలం వేస్తే ఎట్టి పరిస్థితుల్లో మిల్లర్లకు నష్టం జరగకుండా ప్రభుత్వానిది మరో కొత్త ఆలోచన అని విమర్శించారు. జిల్లాలోని రైతులను ఆదుకునే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అంతకు ముందు బీర్‌పూర్ మండలంలోని పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఎమ్మెల్సీ వెంట ఎంపీపీ మసర్తి రమేశ్, జెడ్పీటీసీ పాత పద్మ, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, నాయకులు చెర్పూరి సుభాష్, ఆకుల రాజిరెడ్డి, గుడిసె జితేందర్ తదితరులు ఉన్నారు.

‘ఎంఐఎం అరాచకాలను అరికట్టాలి’



నిరసన తెలుపుతున్న బీజేవైఎం నాయకులు

ధర్మపురి: దళితులపై అరాచకాలు సృష్టిస్తున్న ఎంఐఎం గుండాలను చట్టప్రకారం శిక్షించాలని బీజేపీ యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి చంద్రశేఖర్ డిమాండు చేశారు. దళితులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ గురువారం బీజేవైఎం నాయకులు దొనకొండ నరేశ్, కడారి గంగాధర్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజులు మారినా రాష్ట్రాలు మారినా దళితులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు మాత్రం ఆగడం లేదన్నారు. ఎంఐఎం గుండాల కారణంగా హైదరాబాద్‌కు చెందిన దళిత యువకుడు సోలంకి విజయ్ ఆత్మహత్య చేసుకున్నాడని, విజయ్ భార్యపై ఎంఐఎం గుండాలు అసభ్యంగా ప్రవర్తించిన విషయంలో మలక్‌పేట పోలీసులు బీఆర్‌ఎస్ ప్రభుత్వ ఒత్తిడితో కనీసం కేసు సైతం నమోదు చేయలేదని ఆరోపించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, ఎంఐఎం ఫ్రెండ్లీ పార్టీలని సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా చెప్పడం జరిగిందన్నారు. దళితులపై దాడులు జరిగినా దళిత మంత్రిగా ఉన్న కొప్పుల ఈశ్వర్ స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బెజ్జారపు లవన్‌కుమార్, పిల్లి శ్రీనివాస్, నలుమాసు వైకుంఠం, బండారు లక్ష్మణ్, గాజు భాస్కర్ తదితరులున్నారు.

పుస్తెలతాడు దొంగల అరెస్ట్

మల్యాల(చొప్పదండి): రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడ నుంచి పుస్తెల తాడు చోరీ చేసిన నిందితులను పోలీసులు 24 గంటల్లో పట్టుకున్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గురువారం డీఎస్పీ ఎన్.వెంకటస్వామి వివరాలు వెల్లడించారు. లంబాడీపల్లి గ్రామానికి చెందిన పొన్నం రాజవ్వ బుధవారం మల్యాల అడ్డరోడ్డులో నడుచుకుంటూ వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు స్కూటీపై వచ్చి మహిళ మెడలోని పుస్తెల తాడు చోరీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మల్యాల సీఐ కోటేశ్వర్ ఆధ్వర్యంలో ఎస్సైలు అశోక్, కుమారస్వామి, వెంకటరావు ఆధ్వర్యంలో మూడు బృందాలు ఏర్పాటు చేశారు. సీసీ పుటేజీల ఆధారంగా విచారణ చేపట్టి, మహిళ పుస్తెలు చోరీ చేసిన దొంగలు మల్యాల మండలం సర్వాపూర్ గ్రామానికి చెందిన ఉప్పరి అనిల్, బాసోజి అనిల్‌గా గుర్తించారు. చోరీ చేసిన బంగారం గురువారం కరీంనగర్‌లో విక్రయించేందుకు వెళ్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు కొండగట్టు స్టేజీ వద్ద ఇద్దరిని అరెస్టు చేశారు. వారి నుంచి 15 గ్రాముల బంగారం, స్కూటీ, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ వెల్లడించారు. 24గంటల్లోనే కేసు ఛేదించడంపై సీఐ కోటేశ్వర్, ఎస్సైలను ఎస్పీ భాస్కర్, డీఎస్పీ అభినందించారు.

గల్ఫ్ ఏజెంట్‌పై కేసు

సారంగాపూర్(జగిత్యాల): జగిత్యాల పట్టణానికి చెందిన గల్ఫ్ ఏజెంటుపై గురువారం సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. మండలంలోని గణేశ్‌పల్లికి చెందిన బెత్తపు అశోక్ యూరప్ వెళ్లడానికి గల్ఫ్ ఏజెంట్ మహేశ్‌కు రూ.3.30 లక్షలు ఇచ్చేందుకు ఒప్పుకున్నాడు. ఇందులో ఏజెంటుకు రూ.2.30 లక్షలు ముట్టజెప్పాడు. ఎనిమిది నెలలు గడుస్తున్నా అశోక్‌ను యూరప్ పంపించే విషయంపై ఎలాంటి పురోగతి కనిపించలేదు. దీంతో తన డబ్బులు తిరిగి ఇవ్వాలని అశోక్ కోరాడు. ఈక్రమంలో మహేశ్ డబ్బు ఇవ్వకుండా ఇబ్బందిపెడుతుండడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ చోరీ

కోరుట్ల రూరల్: పట్టణంలోని ఓ హాస్పిటల్ ఎదుట పార్క్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. సదరు ఆసుపత్రిలో పనిచేసే పెంట కిషోర్ బుధవారం రాత్రి 7 గంటలకు ఆసుపత్రి ఎదుట బైక్ పార్క్ చేశాడు. రాత్రి 8 గంటలకు వెళ్లి చూస్తే బైక్ లేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

క్విట్ ఇండియా స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకుందాం



మహాధర్నాలో కార్మిక సంఘాల నాయకులు

జగిత్యాలటౌన్: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను వీడి అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కేంద్ర కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని గురువారం రెండో రోజు కలెక్టరేట్ ఎదుట కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కన్వీనర్ ఇందూరి సులోచన మాట్లాడుతూ, క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో 5 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని, రైతులకు మద్దతు ధర, ఎం యాక్ట్ 2019, విద్యుత్ బిల్లు 2022తో పాటు మరో 11 అంశాలను పరిష్కరించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలని లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయ పాలనాధికారికి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్రం, కో కన్వీనర్ ముదుగం రాజలింగం, మునుగూరి హన్మంతు, మాడిశెట్టి కిరణ్, కోరుకంటి శ్రీనివాస్, తిరుపతి, ధర్మయ్య, పలువురు జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఖిలాగడ్డ ప్రాంతంలో గురువారం సాయంత్రం గంజాయి విక్రయిస్తున్న ఎస్‌కే ముఖీద్‌ను అరెస్ట్ చేశారు. అతడి నుంచి రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు. జిల్లా కేంద్రంలోని జెండా మహిళ ప్రాంతానికి చెందిన ముఖీద్ కొంతకాలంగా గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు గురువారం నిఘా పెట్టి అరెస్ట్ చేశారు.